సాక్షి
వికారాబాద్

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



తాండూరులో 'ఈఎస్ఐ'

ఎట్టకేలకు తాండూరు ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదం లభించింది. 8లో▸



చకచకా 'కేజీబీవీ'

ఏడాది క్రితం ప్రారంభించిన కోట్‌పల్లి కేజీబీవీ హాస్టల్ భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. 8లో▸



అంగన్‌వాడీ సమస్యల ఒడి!

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. అవసరమైన టీచర్లు లేక గందరగోళం నెలకొంది. 9లో▸

న్యూస్‌రీల్

నేడు డీఎస్సీ కౌన్సెలింగ్

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



అనంతగిరి: డీఎస్సీ-2024లో ఎంపికై.. డీఈఓ కార్యాలయంలో రిపోర్ట్ చేసిన అభ్యర్థులందరికీ మంగళవారం వికారాబాద్‌లోని జెడ్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఉంటుందని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, పీఈటీలకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులందరూ అపాయిట్‌మెంట్ ఆర్డర్, రెండు లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

అన్ని గ్రామాలకు బస్సులు తిప్పండి

- కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి
- ఆర్టీసీ ఆర్ఎం, డీఎంలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్ రూరల్: ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, పరిగి, తాండూరు, నారాయణపేట డీఎంలతో సోమవారం కడా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బస్సులు నడిచేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సంబంధిత మార్గాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. బొంరాస్‌పేట మండలం ఎన్కెపల్లి గ్రామానికి, దౌల్తాబాద్, కోస్గి రూట్‌లో అదనపు బస్సులు నడిపించాలని, తాండూరు, మహబూనగర్, పరిగి, నారాయణపేట, కోస్గి డిపోలకు చెందిన బస్సుల సంఖ్య పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు డీఎం సురేష్, నారాయణపేట డీఎం లావణ్య, పరిగి డీఎం కరుణశ్రీ పాల్గొన్నారు.

స్పీకర్, మంత్రులతో భేటీ

చేవెళ్ల: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఆయన గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గం నాయకులతో కలిసి వెళ్లారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిని కలిశారు. వారికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈ నెల 16న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి ప్రమాణ స్వీకరణోత్సవానికి రావాలని ఆహ్వానించారు. వారి వెంట చేవెళ్ల నియోజకవర్గం నాయకులు వసంతం, వీరేందర్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, సురేందర్, రాములు ఉన్నారు.

ఫోర్త్ సిటీలో ఏటీసీ సెంటర్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కందుకూరు: నెట్ జీరో సిటీ (ఫోర్త్‌సిటీ)లో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన భూమి, నిధులు, పరిపాలన అనుమతులను ప్రభుత్వం జారీ చేసింది. కందుకూరు, యాచారం మండలాల్లో ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం భూములు సేకరించింది. ఆ భూముల్లో ప్రస్తుత ప్రభుత్వం ఫోర్త్‌సిటీ ఏర్పాటుకు పనులు ప్రారంభించింది. అందులో భాగంగా కందుకూరు మండలంలో రైతులకు కేటాయిస్తున్న లేఅవుట్ సమీపంలో పంజగూడ రెవెన్యూ సర్వే నంబర్ 90లో రెండు ఎకరాలను ఏటీసీ కోసం కేటాయించింది. ఆగస్టు 1న సీఎం రేవంత్‌రెడ్డి ఏటీసీ సెంటర్‌కు శంకుస్థాపన సైతం చేశారు. కాగా ఆ భూమిలో నిర్మాణాలతో పాటు అవసరమైన మిషనరీ, ఇతర పరికరా లు, శిక్షణకు అయ్యే వ్యయం కోసం టాటా టెక్నాలజీ లిమిటెడ్ భాగస్వామ్యంతో ప్రభుత్వం కలిసి పనిచేస్తోంది. మొత్తం వ్యయం రూ.42.64 కోట్లుగా నిర్ధారించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా 13.25 శాతం కాగా మిగతా వ్యయాన్ని టాటా టెక్నాలజీ లిమిటెడ్ సంస్థ భరించనుంది. మొదటి సారి ఏటీసీ కేంద్రాన్ని ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్నారు. అందులో అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్ శిక్షణకు 48 సీట్లు, ఆర్టిజియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ కోర్సుకు 20 సీట్లు, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్) కోర్సుకు 48 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సుకు 40 సీట్లు, మెకానిక్, ఎలక్ట్రానిక్ వెహికిల్ శిక్షణ కోర్సుకు 48 సీట్లు, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ కోర్సుకు 40 సీట్లు కేటాయించారు. కోర్సుల సమయం రెండు సంవత్సరాలుగా నిర్ణయించారు. ఈ మేరకు కార్మిక, ఉపాధికల్పన, శిక్షణ, కర్మాగారాల శాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాడార్.. రైట్ రైట్

నేడు నేవీ వీఎల్ఎఫ్‌కు భూమి పూజ

- హాజరుకానున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, నేవీ అధికారులు
- ఇప్పటికే హెలికాప్టర్ల ట్రయల్ రన్ పూర్తి



మోడల్ నేవీ రాడార్ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

వికారాబాద్: నేవీ రాడార్ ప్రాజెక్టు ఎన్ని మలుపులు తిరిగినా.. ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. మంగళవారం పనులు ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాడార్ స్టేషన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తారని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. అయితే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, స్పీకర్ ప్రసాద్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు.

మూడు హెలికాప్టర్లలో ముఖ్యులు

మంగళవారం కేంద్రమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాకు విచ్చేయనున్న నేపథ్యంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.ముఖ్యమంత్రి విచ్చేయనున్న హెలికాప్టర్‌కు మూడు రోజుల క్రితమే ట్రయల్ రన్ నిర్వహించగా.. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రానున్న ఆర్మీ హెలికాప్టర్లకు సోమవారం ట్రయల్ రన్ చేపట్టారు. రోజంతా ఆర్మీ హెలికాప్టర్లు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిపాడ్‌లో నాలుగు సార్లు ల్యాండ్ చేసి పరీక్షించారు. ఓ హెలికాప్టర్‌లో రాజ్‌నాథ్ సింగ్, మరో హెలికాప్టర్‌లో నేవీ, రక్షణశాఖ ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక హెలికాప్టర్‌లో రానున్నారు. భూమి పూజ చేయనున్న స్థలంలో సోమ వారం ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి, సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరు ముఖ్య నేతలు రానున్న నేపథ్యంలో వారం రోజులుగా డ్రోన్లతో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమం జరగనున్న స్థలాన్ని నేవీ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తుండగా.. స్థానిక పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

వ్యతిరేకత వచ్చినా ముందుకే..

దామగుండం సమీపంలో లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ఏర్పాటునకు రూ.3,200 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇందుకు సంబంధించి జాతీయ, రాష్ట్రస్థాయిలో 16 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉండగా.. దాదాపు అన్ని పూర్తయ్యాయి. పూడూరులోని దామగుండం నుంచి పరిగి సమీపంలోగల మల్లెమానిగూడ శివారు వరకు 2,900 ఎకరాల అటవీ భూమి అవసరమవుతుందని నేవీసంస్థఅంచనావేసింది. ఇక్కడ తొలగించనున్న మొక్కల స్థానంలో 17.5లక్షల మొక్కలు నాటి సంరక్షించేందుకు ఇప్పటికే రక్షణ శాఖ రూ.133 కోట్లు అటవీశాఖకు అందజేసింది.

15 గ్రామాలకు ఉపాధి అవకాశం

ఓవైపు ప్రాజెక్టు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్న సమయంలో ఒక్కొక్కరు ఒక్కో వాదన తెరపైకి తెస్తున్నారు. ప్రపంచంలోనే 5వ అధునాతన వ్యవస్థ ఏర్పాటునకు జిల్లాలోని దామగుండం అటవీ ప్రాంతం కేంద్రం కానుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెనకబడిన జిల్లాగా చర్చ జరుగుతున్న వికారాబాద్ జిల్లాలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కావటం శుభ పరిణామం అంటున్నారు. పూడూరు, పరిగి, వికారాబాద్ మండలాలకు చెందిన 15 గ్రామాల వరకు దీని ద్వారా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలతో మేలు చేకూరనుందని అధికార కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ నేతలతో పాటు, కొందరు ప్రజా సంఘాల నేతలు, పర్యావరణ ప్రేమికులు ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో పర్యావరణ హననంతో పాటు, ఈ ప్రాంత అభివృద్ధికి ఆటంకం కానుందని ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు.

17.5లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక



దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సభా వేదిక

ప్రాజెక్టు ఏర్పాటు విషయంలో మాత్రం ప్రభుత్వం భూమి పూజకు సిద్ధమైంది. రాడార్ స్టేషన్ ఏర్పాటుకు 12.5 లక్షల చెట్లు తొలగిస్తున్నారని వస్తున్న వార్తలు, చేస్తున్న ఆరోపనలు అవాస్తవమని ఫారెస్టు అధికారులు పేర్కొంటున్నారు. ఈ అడవిలో కేవలం దామగుండం ఆలయ ప్రాంతంలోనే చెట్లు ఉన్నాయని.. వారికి అప్పగిస్తున్న మెజార్టీ భూమిలో చిన్న చిన్న పొదలతో పాటు ప్లేన్ ఏరియానే ఉంది. అడవి దట్టంగా ఉన్న దామగుండం ఆలయ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టబోమని నేవీ అధికారులు అటవీ శాఖకు హామీ ఇచ్చారు. సుమారుగా ఈ ప్రాజెక్టు ఏర్పాటు వల్ల లక్ష నుంచి 1.5 లక్షల చెట్లు తొలగించే అవకాశం ఉన్నట్టు ఫారెస్టు శాఖ అంచనా వేస్తోంది. మొక్కలు రాడార్ స్టేషన్‌లో ఏర్పాటు చేసే యాంటీనాలు, ఇతర నిర్మాణాలు చేపట్టే ప్రదేశాల్లో మాత్రమే తొలగిస్తారు. ఈ మొక్కల తొలగింపు వల్ల జరిగే నష్టాన్ని పూడ్చేందుకు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలలో కలిపి 17.5 లక్షల మొక్కలు నాటేందుకు అటవీ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఆ భూమి ఓనర్‌షిప్ మాత్రం ఎప్పటికీ అటవీ శాఖకే ఉంటుంది. నేవీ వారు వేరే టెక్నాలజీ(శాటిలైట్ తరహా) వాడి ప్రాజెక్టు షిఫ్ట్ చేస్తే మళ్లీ ఆ భూములు అటవీ శాఖకే చెందుతాయి. ఇందులో ఏర్పాటు చేసే యాంటీనాలు 460 మీటర్లు(సుమారు అర కిలోమీటర్) ఎత్తులో ఏర్పాటు చేస్తారు. వాటి ద్వారానే సిగ్నల్ వ్యవస్థ కొనసాగుతుంది. ఇది లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ అయినందున రేడియేషన్ తక్కువగా ఉంటుందని రక్షణ శాఖ వివరిస్తోందని అధికారులు పేర్కొంటున్నారు.



వికారాబాద్ కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిపాడ్‌లో ఆర్మీ అధికారుల ట్రయల్‌రన్



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, నేవీ అధికారులు



తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

సమస్యలు పరిష్కరించాలి

- తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్
- తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

తాండూరు రూరల్: వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన తాండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ధరణి సంబంధిత సమస్యలపై తహసీల్దార్ తారాసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డు గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ..మండల పరిధిలోని ప్రభుత్వ భూ ములను పరిరక్షించాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని చెప్పారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు తదితరులున్నారు.

ధాన్యం సేకరణలో జాగ్రత్తలు తప్పనిసరి

తాండూరు: వరి ధాన్యం సేకరణ విషయంలో జాగ్రత్తలు తప్పక పాటించాలని తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం ధాన్యం సేకరణకు 125 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వరి పంటలు సాగు చేసిన రైతుల వివరాలను ఏఈఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముందుగానే రైతుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.ధాన్యం కొనుగోలులో అక్రమాలకు తావివ్వకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

రాడార్ ఏర్పాటు వద్దు

- దామగుండం పరిరక్షణ కమిటీ నాయకుల డిమాండ్
- ప్రజావాణిలో వినతిపత్రం అందజేత



కలెక్టరేట్‌కు వచ్చిన దామగుండం జేఏసీ ప్రతినిధులు

అనంతగిరి: దామగుండం అడవిలో రాడార్ కేంద్రం ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం పునరాలోచించాలని దామగుండం జేఏసీ నాయకులు గీత, ఆనందం, మల్లేశ్, శ్రీనివాస్, వెంకటయ్య, నర్సింలు, రాములు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్నందున ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వెంటనే ప్రాజెక్టును మరో చోటకు తరలించాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ ప్రజలు ఇప్పటికే అనారోగ్య సమస్యల బారిన పడుతు న్నారని తెలిపారు. సహజసిద్ధమైన ఔషధ మూలికలు, అరుదైన మొక్కలు కలిగిన దామగుండం ప్రాంతాన్ని రాడార్ ఏర్పాటుతో కలుషితం చేయొద్దన్నారు. మూసీ సుందరీకరణ చేపట్టాలనుకుంటున్న ప్రభుత్వం.. మూసీకి పుట్టినిల్లయిన ఈ ప్రాంతాన్ని ఎందుకు కాపాడపటం లేదని ప్రశ్నించారు.



పెద్దేముల్‌లో కురుస్తున్న వర్షం

వాన.. హైరానా

పెద్దేముల్: మండల కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వానతో పంటపొలాలు జలమయమయ్యాయి. చేతికి వచ్చిన పత్తి పంట పాడవుతోందని గాజీపూర్, పెద్దేముల్, నాగులపల్లి, మంబాపూర్, రుద్రా రం తదితర గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే కురిసిన వానలతో 30శాతం పంటలు కోల్పోయామని నిట్టూరుస్తున్నారు.



పెద్దేముల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నారాయణరెడ్డి

యువతను ప్రోత్సహించేందుకే పోటీలు

- పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి

పెద్దేముల్: క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తుంటారని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిట్టెపు ప్రకాశ్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో యువత ప్రతిభ వెలికితీయవచ్చన్నారు. క్రీడలతో స్నేహబంధాలు పెంపొందిచుకోవచ్చన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. అనంతరం మొదటి స్థానంలో నిలిచిన పెద్దేముల్ జట్టుకు రూ.21వేలు, ద్వితీయ స్థానంలో నిలిచి తట్టెపల్లి జట్టుకు రూ.11వేలతో పాటుగా షీల్డ్ అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్, బౌలర్, రన్నర్‌లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు సి.రాఘవేందర్‌రెడ్డి, పెద్దేముల్ ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కోటపల్లి ఎస్ఎంసీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ చైర్మన్ బుజ్జమ్మ, మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, నాయులు మైపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, అంజిల్‌రెడ్డి, కిషన్‌రావు, ఇందూరు, ప్రకాశం , ఎర్ర బాలప్ప, మధుసుదన్‌రెడ్డి, విద్యాసాగర్, నరేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆజంఖాన్, ప్రవీన్‌కుమార్, నర్సింలు, శిబ్లి , చందర్ నాయక్, ఆర్గనైజర్లు, బంగ్ల రవికుమార్‌రెడ్డి (రఘు), సి.వెంకటేశ్, మతీన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆ 'పరేషాన్'!

- నిలిచిపోయిన కు.ని. శస్త్రచికిత్సలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండేళ్లుగా బంద్
- ప్రైవేటు ఆస్పత్రుల వైపు పరుగులు
- మళ్లీ అనుమతి ఇవ్వాలంటున్న మహిళలు



చేవెళ్లలోని ప్రభుత్వ ఆస్పత్రి

చేవెళ్ల: జనాభా కట్టడిలో కుటుంబనియంత్రణ ఆపరేషన్లు కీలకం. వీటిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించే డీపీఎల్ (డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్) శస్త్రచికిత్సలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ క్యాంపులను జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతీనెల నిర్వహించేవారు. రెండేళ్ల క్రితం ఆపరేషన్లలో అపశ్రుతి చోటుచేసుకుంది. నలుగురు మహిళలు మృతి చెందడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. అప్పటి నుంచి శిబిరాలను నిలిపివేసింది. ఈ సంఘటన జరిగి రెండేళ్లు కావస్తున్నా తిరిగి ఆపరేషన్లు పునరుద్ధరించాలనే ఊసే ఎత్తడం లేదు. గత ప్రభుత్వం హయాంలో నిలిచిపోయిన ఈ ఆపరేషన్లను ఈ ప్రభుత్వంలోనైనా మళ్లీ ప్రారంభిస్తారని మహిళలు ఎదురుచూస్తున్నారు.

డీపీఎల్ క్యాంపుల వైపే మొగ్గు

మహిళలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఎక్కువగా డీపీఎల్ క్యాంపుల వైపే మొగ్గు చూపిస్తుంటారు. ఈ శిబిరాలు లేకపోవటంతో ఇప్పుడు రెండు, మూడో కాన్పు తరువాత ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఈ ఆపరేషన్ చేయించుకుంటే వారం రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండాల్సి ఉంటుంది. ఇవి కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో తక్కువగానే చేస్తున్నారు. దీంతో మహిళలు గత్యంతరం లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆస్పత్రుల స్థాయిని బట్టి రూ.20వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేసే డీపీఎల్ ఆపరేషన్లతో పైసా ఖర్చు లేకుండా కేవలం మూడు నాలుగు గంటల వ్యవధిలోనే ఇంటికి పంపిస్తారు. అందుకే ఈ క్యాంపులు ఎప్పుడు పెట్టినా పెద్ద ఎత్తున మహిళలు ఆపరేషన్లు చేయించుకునేందుకు ముందుకు వస్తుంటారు.

క్యాంపుల్లో పెద్ద సంఖ్యలో ఆపరేషన్లు

డీపీఎల్‌క్యాంపుల నిర్వహణ సమయంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఆపరేషన్లు చేయించుకున్నారు. ప్రతి డివిజన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకు రెండు సార్లు ఈ క్యాంపులు నిర్వహించేవారు. జిల్లాలో 2021-22లో డీపీఎల్ క్యాంపు ద్వారా 7,223 మంది ఆపరేషన్లు చేయించుకున్నారు. 2022-23లో 1,833 మంది శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతీనెల నిర్వహించే శిబిరాల్లో 100-150 మంది వరకు ఆపరేషన్లు చేయించుకునేవారని గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్యాంపులకు బ్రేక్ పడినప్పటి నుంచి ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువగా ట్యూబెక్టమీ ఆపరేషన్లు జరుగుతున్నాయి. ప్రభుత్వం డీపీఎల్ క్యాంపుల ప్రాముఖ్యతను గుర్తించి పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం అనుమతిస్తేనే..



వేసక్టమీపై ఎంత ప్రచారం చేసినా పురుషులెవరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కు.ని ఆపరేషన్లలో డీపీఎల్‌కు మహిళల నుంచి మంచి ఆదరణ ఉండేది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఈ క్యాంపులు నిలిచిపోయాయి. ప్రభుత్వం అనుమతిస్తేనే మళ్లీ క్యాంపులు మొదలవుతాయి.

– దామోదర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, చేవెళ్ల డివిజన్

క్లుప్తంగా

శోభాయాత్రలో ఘర్షణ

- నాగులపల్లిలో పోలీస్ పికెటింగ్
- ఇరువర్గాలకు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి కౌన్సెలింగ్

పెద్దేముల్: ఇరువర్గాల ఘర్షణతో నాగులపల్లి గ్రామంలో ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు.. మండల పరిధిలోని నాగులపల్లిలో దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేసిన వద్ద ఓ యువకుడు బైక్‌పై నుంచి కింద పడ్డాడు. దీంతో ఆ యువకుడు విగ్రహ ఏర్పాటు వల్లే తాను ప్రమాదానికి గురయ్యాన్ని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో అదికాస్త గొడవకు దారి తీసింది. దీంతో ఆ యువకుడి సంబంధించిన కొంత మంది యువకులు ఆదివారం అమ్మవారి నిమజ్జన శోభయాత్రను అడ్డుకున్నారు. ఇరు వర్గాల వారు చేయి చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్‌ఐ గిరి పలువురు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. ఇరువర్గాల వారికి నచ్చజెప్పారు. అనంతరం నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగింది. రాత్రి గ్రామంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూరు రూరల్ సీఐ అశోక్ సోమవారం ఉదయం ఇరువర్గాల వారిని పెద్దేముల్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరు వర్గాల వారికి రాజీ కుదిర్చారు. ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉందని ఎస్‌ఐ గిరి తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అదుపులో తొమ్మిది మంది

శంకర్‌పల్లి: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన మండల పరిధిలోని అలంఖాన్‌గూడ గ్రామ శివారులో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అలంఖాన్‌గూడ గ్రామ శివారులోని ఓ పొలం వద్ద పదిమంది పేకాట ఆడుతున్నారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నారు. వీరి నుంచి రూ.37వేల నగదు, 9ఫోన్లు, 5 బైకులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు భావన



పిట్టల భావన

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలోని రాజ శ్రీ విద్యామందిర్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి పిట్టల భావన జతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈనెల 9న నల్గొండలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఈనెల 15నుంచి 17 వరకు తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఖోఖో సంఘం రాష్ట్ర కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు మంజుల, జిల్లా కార్యదర్శి తోట జయప్రకాశ్ తదితరులు భావనను అభినందించారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ హౌస్ అరెస్ట్



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: ఎమ్మెల్యే రాజాసింగ్‌ను మంగళ్‌హాట్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని ఓ ఆలయంలో జరిగిన సంఘటనపై సమాచారం అందడంతో రాజాసింగ్ అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించగా మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయనను బయటికి రాకుండా ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ప్రాంతంలోని ఒక ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. తనను అక్కడికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

తాండూరులో 'ఈఎస్‌ఐ'



ఈఎస్‌ఐ ఆసుపత్రికి కేటాయించిన పాత మున్సిపల్ కార్యాలయం

- ఆస్పత్రి ఏర్పాటుకు వేగంగా అడుగులు
- పాత మున్సిపల్ భవనం నుంచి త్వరలోనే సేవలు
- కార్మికులకు తీరనున్న వైద్య కష్టాలు

తాండూరు: ఎట్టకేలకు తాండూరు ప్రాంతంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ఆమోదం లభించింది. రెండు నెలల వ్యవధిలో జిల్లాలోని కార్మికులకు ఈఎస్‌ఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి. తాండూరు ప్రాంతంలోని నాపరాతి గనులు, సిమెంట్ ఫ్యాక్టరీల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి సరైన వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేస్తే వీరికి ఎంతో వెసులుబాటు ఉంటుంది. వ్యాపార కేంద్రంగా తాండూరు ఎంతో ప్రసిద్ధి చెందింది. 1970 నుంచి ఇక్కడ సిమెంట్ కర్మాగారాలు వెలిశాయి. కర్ణాటక సరిహద్దులోని ఈప్రాంతంలో 6 భారీ సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిలో సుమారు 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. మరోవైపు నాపరాతి గనులు, పాలిషింగ్ యూనిట్లలో సుమారు 30 వేల మంది ఉపాధి పొందుతున్నారు. సుద్ద గనులతో పాటు చిన్నతరహా పరిశ్రమల్లోనూ వేలాది మంది పనిచేస్తున్నారు. వీరితో పాటు వీరి కుటుంబ సభ్యులకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు.

> రెండు నెలల వ్యవధిలో
>
> వచ్చే రెండు నెలల కాలంలో ఈఎస్‌ఐ సేవలు ప్రారంభమయ్యేలా కృషిచేస్తున్నాం. పాత మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ఇందుకు అనువుగా తీర్చిదిద్దే పనులు చేపట్టాలని సూచించాం. త్వరలోనే ఈఎస్‌ఐ ఆస్పత్రికి వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ అవుతాయి.
>
> – బి.మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు


మూడు దశాబ్దాల కల సాకారం..

తాండూరు ప్రాంతంలో కార్మికుల కోసం ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మించాలని మూడు దశాబ్దాలుగా కార్మికులతో పాటు రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో వివిధ పార్టీల తరఫున బరిలో నిలిచిన నేతలు ఈమేరకు హామీలు సైతం ఇచ్చారు. కానీ ఇప్పటి వరకూ సాధ్యం కాలేదు. తాండూరులో ఈఎస్‌ఐ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా కార్యరూపం దాల్చలేదు.

పాత మున్సిపల్ భవనంలో..

పట్టణంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు పాత మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ఎంచుకున్నారు. శాశ్వత భవనం నిర్మించే వరకూ ఇక్కడ వైద్య సేవలు కొనసాగుతాయని తెలుస్తోంది. ఇందుకోసం మున్సిపల్ పాలకవర్గం సైతం సానుకూలంగా ఉంది.

వేప కల్లు



తాటి కల్లు.. ఈత కల్లు ఇలా చెట్లను బట్టి గౌడన్నలు కల్లు గీస్తుండడం సాధారణం. దుద్యాల మండల పరిధిలోని హస్నాబాద్‌లో మాత్రం వేప చెట్టుకు కల్లు కారుతోంది. గ్రామంలోని గాంధీ చౌక్ దగ్గర చావుడి ఆవరణలో దాదాపు 50 ఏళ్ల కిత్రం నాటిన చెట్టుకు ఎవరూ గీయకుండానే కల్లు కారుతుండడంతో జనం ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఆరోగ్యానికి మంచిదని గ్రామస్తులు చెట్టుకు ఎక్కి డబ్బాలోంచి వేపకల్లు తెచ్చుకుని సేవిస్తున్నారు. – దుద్యాల్

స్పందించారు.. రక్షించారు..

మహిళా ప్యాసింజర్‌ను కాపాడిన ఆర్పీఎఫ్ పోలీసులు

అడ్డగుట్ట: కదులుతున్న రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడబోతున్న మహిళా ప్యాసింజర్‌ను ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు కాపాడారు. ఆర్పీఎఫ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సోమవారం ఉదయం లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చిన పూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగి వెళ్తున్న క్రమంలో ఓ మహిళా ప్యాసింజర్ రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు మెట్ల పైనుంచి అదుపు తప్పింది. ఆమె రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో పడబోతుండగా అక్కడే విధు ల్లో ఉన్న ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రాజ శేఖర్, కానిస్టేబుల్ విశ్వజిత్ కుమార్ హుటాహుటిన ఆమెను వెనక్కి లాగి ఆమె ప్రాణాలను కాపా డారు. ఈ ఘటనలో ఆర్పీఎ ఫ్ పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్యాసింజర్ ప్రాణాలను కాపా డిన కానిస్టేబుళ్లను ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత బెనర్జీ అభినందించారు. ఆపరేషన్ జీవన్ రక్ష కార్యక్రమంలో భాగంగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడుతున్న ఆర్పీఎఫ్ పోలీసులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

జాబ్ క్యాలెండర్ పాటించండి

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ కొత్తగా ఇచ్చిన నోటిఫికేషన్లు ఏమీ లేవని బీఆర్‌ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లు ప్రస్తుత ప్రభుత్వం భర్తీ చేస్తోందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన రాజేందర్, రాజేశ్ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడంతో సోమవారం ఆయన తన నివాసంలో వారిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ భర్తీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్‌లు విడుదల చేయాలన్నారు. రాజేందర్ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, బలాల తదితరులు పాల్గొన్నారు.



రాజేందర్, రాజేశ్‌ను సన్మానిస్తున్న మహేశ్‌రెడ్డి తదితరులు

పేదలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పీర్లంపల్లిలో నక్కల ఈరమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహేశ్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రాజు, నర్సింలు తదితరులున్నారు.

సమీకృత భవనాల ఏర్పాటుకు కసరత్తు

స్థల పరిశీలనలో అధికారులు

దుద్యాల్: నూతనంగా ఏర్పాటు చేసిన దుద్యాల్ మండల కేంద్రంలో సమీకృత కార్యాలయాల నిర్మాణం కోసం తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్‌తో కలిసి కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి సోమవారం స్థల పరిశీలన చేశారు. మండలం ఏర్పాటు చేసి రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాకలపాలు మాత్రం పాత మండల కేంద్రాల్లోనే ఉండడతో ప్రజలు అక్కడకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం మాత్రం స్థానిక ఉర్దూ మీడియం పాఠశాలలో కొనసాగిస్తున్నారు. విద్యావనరుల కార్యాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ అదనపు గదిలో కొనసాగిస్తున్నారు. మండల కేంద్రం సమీపంలోని లగచెర్ల మార్గంలో, రైతు వేదిక పక్కన, దుద్యాల్ గేట్ సమీపంలోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. మండల కేంద్రానికి కావాల్సిన అన్ని కార్యాలయాలు ఒకే దగ్గర నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ స్థల పరిశీలనలో ఆర్‌ఐ రవి కిశోర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య ఉన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్

సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌పై డ్యాష్ బోర్డు



సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌పై సమీక్ష నిర్వహిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

- ఆన్‌లైన్‌లో మ్యాన్‌హోళ్ల డీ సిల్టింగ్ వివరాలు
- జీపీఎస్ ఆధారంగా క్యాన్ నంబర్ల నమోదు
- ఎంసీసీ ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం

సాక్షి,సిటీబ్యూరో: సీవరేజ్ ఓవర్ ఫ్లో స్పెషల్ డ్రైవ్ తీరును డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో 90 రోజుల స్పెషల్ డ్రైవ్ పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మ్యాన్ హోళ్ల డీసిల్టింగ్ వివరాల్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. తీసిన వ్యర్థాలను (సిల్ట్) డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. డంపింగ్ యార్డులు అవసరమైతే వాటి ఏర్పాటుకు అనువైన స్థలాలు పరిశీలించాలని సూచించారు. సీవరేజ్ ఓవర్‌ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర అంశాలపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్ లో నమోదు చేస్తున్నామన్నారు. ఈ నమోదు ఒక్కో ప్రాంతంలో ఎన్ని సార్లు ఫిర్యాదులు అందినవి, ఎన్నిసార్లు పరిష్కరించిన వివరాలను ఆ మ్యాప్‌లో ఒక బబుల్ (బుడగ) లా కనిపించేలా ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా ఆ బబుల్ పరిమాణం మారుతుందన్నారు. ఈ ఏర్పాటు వల్ల సమస్య తీవ్రతను బట్టి అధికారులు దానిని పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.

ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం

ఎంసీసీలో వచ్చే ఫిర్యాదులపై తాత్కాలికంగా కాకుండా.. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం చూపించాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్‌పై నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. క్షేత్ర స్థాయిలో మంచి పనితీరు కనబరుస్తున్నందుకు సిబ్బందిని, అధికారులను ఆయన అభినందించారు. రాబోయే రోజుల్లోనూ ఇదే చిత్త శుద్ధి, అంకితభావంతో కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు.

డ్రైబోర్ వెల్స్ సర్వే వేగవంతం

డ్రై బోర్ వెల్స్‌పై కొనసాగుతున్న సర్వేను వేగవంతం చేయాలని ఎండీ అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వినియోగదారులు తమ ఇళ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. నిర్లక్ష్యంగా ఉన్నవారికి నోటీసులు జారీ చేయాలన్నారు. వచ్చే జనవరి నుంచి ట్యాంకర్ బుక్ చేస్తే అదనపు ఛార్జి వసూలు చేస్తామని స్పష్టంగా చెప్పాలన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారుల ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో పంపించడంతో పాటు నేరుగా వారికి కరపత్రాలు అందజేయాలని సూచించారు.

ఓటీఎస్‌పై ప్రత్యేక దృష్టి

నల్లా నీటి వినియోగదారుల బకాయిలకు సంబంధించి వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా పంపించాలని ఎండీ సూచించారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీం సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అందులో బిల్లు చెల్లింపునకు చెందిన లింకును కూడా పంపించాలని.. తద్వారా వారికి సులభంగా ఉంటుందన్నారు. సమావేశంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్–2 స్వామి, డైరెక్టర్ ఆపరేషన్స్–1 విజయరావు, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించండి



అనంతగిరి: దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: ప్రజావాణికి ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సుధీర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 55 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏఓ కరీనా ఖాతుం, సెక్షన్ సూపరింటెండెంట్ సంధ్య, డీటీ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ధరఖాస్తులు నిల్

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు ఏమీ రాలేదు. అధికారులు సకాలంలో ప్రజావాణికి హాజరై మధ్యాహ్నం వరకు వేచియున్న ఎవరూ రాలేదు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఈఈ పీఆర్ ప్రణీత్‌కుమార్, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట ప్రజావాణిలో అధికారులు

సమస్యలకు పరిష్కారం చూపండి

తాండూరు: ప్రజావాణికి వస్తున్న దరఖాస్తుల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ అన్నారు. సోమవారం తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ పరమైన ఆరు అర్జీలు, వ్యవసాయ శాఖ-1, పంచాయతీ రాజ్ శాఖ-2 చొప్పున దరఖాస్తులు అందాయి. వాటిని సబ్-కలెక్టర్ సంబంధింత అధికారులను అందజేసి వెంటనే పరిష్కరించాలన్నారు.



తాండూరు: దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ జీరో బిల్లులు రావడంలేదని, పింఛన్ల కోసం దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కబ్జాలపై చర్యలు తీసుకోండి



జీహెచ్ఎంసీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్ కాలనీలో గత కొన్నేళ్లుగా రోడ్లకు ఇరువైపుల వ్యాపారులు పక్కా డబ్బాలను ఏర్పాటు చేసుకుని కబ్జాకు యత్నిస్తున్నారని, ప్రజావాణిలో వీరాంజనేయ దేవాలయ కమిటీ జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లకు ఇరువైపుల డబ్బాలు వేసి కబ్జా చేస్తున్నారన్నారు. కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని, మధుబన్ కాలనీలోకి వచ్చే ప్రధాన రహదారి కంకర తేలడంతో బస్సులు ఒక రూట్‌లోనే వస్తున్నాయన్నారు. గతంలో రెండు రూట్లలో బస్సులు తిరిగేవని ప్రస్తుతం రోడ్లు దెబ్బతినడంతో ఒక రూట్‌లోనే వస్తున్నాయని వివరించారు. కాలనీల్లో పర్యటించి తమ సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు గోవింద్‌రాజ్,కిషోర్, దిలీప్‌భరత్, ఉదయ్‌రావు, అనిల్‌రెడ్డి తదితరులున్నారు.

కోడలిపై అత్త, ఆడపడుచు దాడి

వేడి నీళ్లు పోయడంతో తీవ్ర గాయాలు



గాయపడిన నజియా బేగం

సంతోష్‌నగర్: కోడలిపై అత్త, ఆడపడుచు వేడి నీళ్లు పోవడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాకు చెందిన నజియా బేగంకు సంతోష్‌నగర్ ఓవైసీ కాలనీకి చెందిన షేక్ షబ్బీర్‌తో వివాహం జరిగింది. షేక్ షబ్బీర్ ప్రస్తుతం ఉద్యోగం నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. నజియా బేగంకు నలుగురు సంతానం. అత్త మహ్మదియా బేగంతో తరుచూ గొడవలు జరుగుతుండటంతో నజియా బేగం కొద్ది రోజుల క్రితం అదే ప్రాంతంలో పిల్లలతో కలిసి వేరుగా నివాసముంటోంది. ఆదివారం పిల్లలు నానమ్మ ఇంటికి వెళ్లడంతో వారిని తీసుకొచ్చేందుకు నజియా బేగం అత్తగారింటికి వెళ్లింది. ఈ సందర్భంగా అత్త, ఆడపడుచుల మధ్య వాగ్వాదం జరగడంతో ఆగ్రహానికి లోనైన అత్త మహ్మదియా బేగం, ఆమె కుమార్తె కలిసి నజియా బేగంపై వేడి నీళ్లు పోయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం బాధితురాలు నజియా బేగం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి

మొయినాబాద్: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11న రాత్రి 8.30 గంటల సమయంలో మొయినాబాద్‌లోని మన్‌గ్రోమోర్ సెంటర్ వద్ద గుర్తుతెలియని మహిళ(50)ని ఓ వా హనం ఢీకొట్టింది. దీంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చకచకా 'కేజీబీవీ'



కేజీబీవీ హాస్టల్ భవనం

- అధికారులు, నేతల సమన్వయంతో పనుల్లో వేగం
- చివరి దశకు చేరిన హాస్టల్ భవన నిర్మాణ పనులు

బంట్వారం: ఏడాది క్రితం ప్రారంభించిన కోట్‌పల్లి కేజీబీవీ హాస్టల్ భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం రూ.3.5కోట్లతో కరీంపూర్ గేటు వద్ద ఈ పనులు ప్రారంభించారు. రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ భవనంలో ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. కోట్‌పల్లి కేజీబీవీకి పక్కా భవనం లేక కొన్నేళ్లుగా ప్రాథమిక పాఠశాల భవనంలోనే బోధన సాగుతోంది. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 250మంది విద్యార్థులుండగా వారు అరొకర వసతుల నడమే విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. కరీంపూర్ గేటు వద్ద ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించే ఈ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తికావస్తున్నాయి.

> రూ.3.5 కోట్లు మంజూరు చేయించాం
>
> 
>
> మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సహకారంతోనే అప్పట్లో కోట్‌పల్లి కేజీబీవీ హాస్టల్ భవనం నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరు చేయించాం. ఇందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని కరీంపూర్ గేటు వద్ద ఎంపిక చేసి 2023లో పనులు ప్రారంభించాం. పనులు చివరిదశలో ఉన్నాయి. హాస్టల్ భవనం అందుబాటులోకి వస్తే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుంది. అధికారులు, కరీంపూర్ గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిది.
>
> – అనిల్, మాజీ సర్పంచ్, కరీంపూర్

మూడు నెలల్లో అప్పగిస్తాం

మరో మూడు నెలల్లో కోట్‌పల్లి కేజీబీవీ హాస్టల్ భవనం నిర్మాణం పూర్తి చేసి అప్పగిస్తాం. ప్రస్తుతం ఫినిషింగ్ పనులు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్‌తో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచాం. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు వసతి గృహంలోనే ఉంటూ చదువుకునేలా సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– రాజు, డీఈ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ